సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 7 । జూలై । 2023



100 రోజుల 'ఉపాధి'

జాబ్ కార్డులు ఉన్న అందరికీ 100 రోజుల ఉపాధి కల్పించాలని సీఎస్ కె.ఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 8లో



భారతీయ విద్యార్థులు 34 వేలు

జర్మనీలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేలా కుచ్లర్ అన్నారు. 8లో

శునక షోయగం



జడ్జి కోర్టు సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో గురువారం పెంపుడు జంతువులు సందడి చేశాయి. 8లో

న్యూస్‌రీల్

మేయర్ అహ్మదాబాద్ పయనం



మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: జీ-20 సదస్సులో భాగంగా అహ్మదాబాద్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు మేయర్ల సదస్సు(యూ-20 మేయర్ల సమ్మిట్ సెషన్) జరుగుతోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం బయలుదేరి వెళ్లారు. తొలి రోజు స్వాగత సదస్సు, వివిధ కార్యక్రమాలుంటాయని, ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ దేశాలకు చెందిన పలువురు మేయర్లు పాల్గొంటారని ఆమె కార్యాలయ వర్గం ఓ ప్రకటనలో తెలిపింది. రెండో రోజు పర్యావరణ పరిరక్షణకు చేపడతున్న వివిధ కార్యక్రమాలను మేయర్ డెలిగేట్స్‌కు వివరించనున్నారు. చివరి రోజు యూ-20 ట్రీ ప్లాంటేషన్, రౌండ్ టేబుల్ సమావేశాలు ఉంటాయి. ఈ నెల 9వ తేదీ వరకు మేయర్ విశాఖలో అందుబాటులో ఉండరని ఆమె కార్యాలయం వర్గం పేర్కొంది.

మంగళంపల్లికి స్వర నివాళి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: సంగీత కళానిధి మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి సందర్భంగా విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువారం స్వర నివాళి అర్పించారు. అకాడమి అధ్యక్షుడు రంగరాజన్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వీరఘంట చంద్రశేఖర్ మోహన్‌కృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత పోటీల్లో విజేతలకు అకాడమీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. 15 ఏళ్లలోపు విభాగంలో అనుపమ కృతి (హైదరాబాద్), శిష్టశ్రీ ప్రణతి, రమాకాంత్ (హైదరాబాద్), 18 ఏళ్లలోపు విభాగంలో లోకర్త నాగ వైష్ణవి, కోటా గాయత్రి, మహతి, 25 ఏళ్ల విభాగంలో యడవిల్లి భవన, వరంగల్‌కు చెందిన సీహెచ్ కృష్ణవేణి విజేతగా నిలిచారు. అనంతరం బాలమురళీకృష్ణ ప్రియ శిష్యుడు విద్వాన్ మోహన్‌కృష్ణ గాత్ర కచేరితో స్వర నీరాజనం అర్పించారు.

విద్యా కార్యక్రమాలపై పర్యవేక్షణ అవసరం



ఎంఈవోలతో సమీక్షిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలతో మెరుగైన ఫలితాలు సాధించేలా పర్యవేక్షణ పెంచాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లతో గురువారం తన చాంబర్‌లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక అందేలా చూడాలన్నారు. నాడు- నేడు పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు వివరాలను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ఈ విషయంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సకాలంలో తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాఠశాలల్లో అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు, అదేవిధంగా విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇకో-వైజాగ్ కాన్సెప్ట్‌పై నేడు చిత్రలేఖన పోటీలు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఇకో-వైజాగ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై అవగాహనకు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. నగరంలోని 592 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఇకో-వైజాగ్ కాన్సెప్ట్‌పై శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేంజర్ ఫోర్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇకో క్లీన్, ఇకో గ్రీన్, ఇకో బ్లూ, ఇకో జీరో ప్లాస్టిక్, ఇకో జీరో పొల్యూషన్ అనే ఐదు కాన్సెప్ట్‌ల్లో ఏదైనా ఒకటి విద్యార్థులు తీసుకోవచ్చని తెలిపారు. 3 నుంచి 6వ తరగతి వరకు జూనియర్ విభాగం, 7 నుంచి 10వ తరగతి వరకు సీనియర్ విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల అనంతరం ఆ చిత్రలేఖనాలతో ఆర్ట్ ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

బోటు కొనుక్కున్నా.. ఇక ఇక్కడే ఉంటా



విజయనగరం జిల్లా తిప్పలవలసకు చెందిన నక్కా అప్పన్న. వయసు 55 ఏళ్లు. 2014 నుంచి గుజరాత్‌లోని వీరావల్ హార్బర్‌లో నెలకు రూ.8 వేల జీతానికి చేపల వేట చేస్తున్నాడు. 2018 నవంబర్ 27న వీరి బోట్లు పొరపాటున పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. అప్పన్నతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన 20 మంది జాలర్లను పాకిస్తాన్ అధికారులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో 2020 జనవరి 1న వీరంతా విడుదలయ్యారు. సీఎం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ఇకపై గుజరాత్‌కు వలస వెళ్లవద్దని, హార్బర్లు కట్టిస్తానని, ఇక్కడే ఉండి వేట చేసుకోవాలని సూచించారు. ఆ ప్రకారమే హార్బర్ల నిర్మాణం జరుగుతోంది. గుజరాత్‌కు వెళ్లకుండా ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలతో బోటు కొనుగోలు చేసి స్వగ్రామం తిప్పలవలసలోనే ఉంటూ కొడుకుతో కలిసి సొంతంగా వేట సాగిస్తున్నామని నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు సంపాదిస్తున్నామని అప్పన్న ఆనందంతో చెప్పాడు.



ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సొమ్ముతో కొనుగోలు చేసిన బోటుతో నక్కా అప్పన్న

వలస బతుకుల్లో సర్కారీ వెలుగులు

మూడు దశాబ్దాలుగా చేపల వేటకు గుజరాత్ పయనం

ఉత్తరాంధ్ర నుంచి 20 వేల మంది మత్స్యకారుల వలస	పొరపాటున పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లడంతో అరెస్టులు	ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గాల్సిన దుస్థితి	ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో విడుదల	ప్రభుత్వ నిర్ణయాలతో వలసలకు స్వస్తి	కొత్త హార్బర్లు ఏర్పాటయ్యాక ఏపీలోనే ఉంటామంటున్న జాలర్లు

(బొల్లం కోటేశ్వరరావు, సాక్షి, విశాఖపట్నం)

ఇన్నాళ్లూ ఆ మత్స్యకారులు పొట్టకూటి కోసం రాష్ట్రాలు దాటి వలసలు పోయేవారు. భార్యాపిల్లలను ఇంటి వద్దే వదిలేసి.. ఊహ తెలిసిన కొడుకుల్ని వెంటబెట్టుకుని ఊళ్లొదిలి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌కు వలస బాట పట్టేవారు. అక్కడ వారికిచ్చే అరకొర జీతంతోనే బతుకులీడ్చే వారు. ఏడాదిలో 8 నెలలు (ఆగస్టు నుంచి మార్చి వరకు) అక్కడే గడిపేవారు. సముద్రంలో సరిహద్దులు తెలియక చేపల వేట సాగిస్తే పొరుగు దేశంలోని పాకిస్తాన్ జైళ్ల పాలయ్యేవారు. ఏళ్ల తరబడి ఆ జైళ్లలోనే మగ్గేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు మునుపటిలా గుజరాత్ వెళ్లే ఆలోచన విరమించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వీరి బతుక్కి భరోసానిచ్చే ముఖ్యమంత్రి వచ్చారు. రాష్ట్రంలో కొత్తగా హార్బర్లు, పోర్టుల నిర్మాణాన్ని చేపట్టారు. మత్స్యకారులకు ఉపాధి లభించే మార్గాలను సుగమం చేస్తున్నారు. ఏటా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా సొమ్ము కూడా ఇస్తున్నారు. ఇకపై ఎక్కడెక్కడికో వలస పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వేట సాగించే అవకాశాలు కల్పిస్తున్నారు.

ఉత్తరాంధ్ర నుంచి వేలల్లో వలసలు

ఒకప్పుడు చేపల వేట సాగించేందుకు తగిన వనరులేక ఉత్తరాంధ్ర మత్స్యకారులు వేల సంఖ్యలో గుజరాత్‌కు వలస పోయేవారు. ఆ రాష్ట్రంలోని వనక్‌బరా, వీరావల్, పోర్‌బందర్, ఓఖా, మాంగ్‌రోల్ తదితర ఫిషింగ్ హార్బర్ల నుంచి అరేబియా సముద్రంలో వేట సాగించేవారు. అక్కడ వేటకు మత్స్యకారుల కొరత, వారికంటే తక్కువ వేతనానికే మన జాలర్ల లభ్యతతో ఆ ప్రాంత బోటు యజమానులు వీరిని తీసుకెళ్లేవారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.60 వేల అడ్వాన్స్, నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల జీతం చెల్లించేలా ఒప్పందం చేసుకుంటారు. అడ్వాన్స్ పోగా మిగతా సొమ్మును 8 నెలల అనంతరం ఇంటికొచ్చే సమయంలో ఇస్తారు. ఇన్నాళ్లూ మన తీరంలో తగినన్ని హార్బర్లు, పోర్టులు లేక గుజరాత్‌లో ఇచ్చే చాలీచాలని జీతానికే ఆశపడి మైనర్ కొడుకులను సైతం వెంటబెట్టుకుని వలస వెళ్లేవారు. వేటకెళ్లిన వారు సముద్రంలో తమకు సరిహద్దులు తెలియక తరచూ పాకిస్తాన్ అధికారులకు చిక్కడం, వారు విడుదలయ్యే మార్గం లేక ఏళ్లకు ఏళ్లు జైళ్లలోనే మగ్గడం పరిపాటైపోయింది. ఒక బోటులో 8 మంది వేట సాగిస్తారు. నెలలో రెండుసార్లే ఒడ్డుకు వస్తారు. అనారోగ్యం పాలైనా, చనిపోయినా అంతే సంగతులు. స్వస్థలానికి శవాన్ని తీసుకొచ్చే ఆర్థిక పరిస్థితి లేక అక్కడే అంతిమ సంస్కారాలు పూర్తిచేసి బూడిదను మాత్రమే కుటుంబీకులకు తెస్తారు.

సీఎం నిర్ణయంతో..

ఇలా గుజరాత్‌కు వలస పోతున్న తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాకిరణంలా మారారని మత్స్యకారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే గుజరాత్‌కు వలసలు మానుకున్న ఉత్తరాంధ్ర మత్స్యకారులు కొందరు స్థానికంగానే చేపల వేట సాగిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (అనకాపల్లి), ఉప్పాడ (కాకినాడ), మచిలీపట్నం (కృష్ణా), జువ్వలదిన్నె (నెల్లూరు) సహా 8 చోట్ల ఫిషింగ్ హార్బర్లు, మరో 7 చోట్ల ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి గుజరాత్, దక్షిణాది రాష్ట్రాల్లోని హార్బర్లకు వలస వెళ్లే అవసరం, పాక్‌లో జైళ్ల పాలయ్యే పరిస్థితి రాదని ఈ మత్స్యకారులు చెబుతున్నారు.

హార్బర్లలో మూలుగుతున్న బోట్లు

రాష్ట్రం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే మత్స్యకారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఆ రాష్ట్రంలోని ప్రధాన హార్బర్లలో బోట్లు మూలుగుతున్నాయి. ఇన్నాళ్లూ కళాసీలుగా పిలిచి ఈ మత్స్యకారులతోనే అక్కడ వ్యాపారులు బోట్లను నడిపేవారు. ఇప్పుడు వీరి కొరతతో వ్యాపారులు/బోటు యజమానులు హార్బర్లలోనే బోట్లను కట్టేశారని, గతంకంటే ఎక్కువ సొమ్ము ఇస్తామని ఆశ చూపినా వెళ్లడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

ఆ మత్స్యకారులందరికీ విముక్తి

2018 నవంబర్‌లో పాక్ అధికారులకు చిక్కి జైళ్ల పాలైన 20 మందితో పాటు అంతకు ముందు కొన్నేళ్ల నుంచి అక్కడి జైలులో మరో ముగ్గురు జాలర్లు మగ్గుతున్నారు. అప్పటి ప్రభుత్వం వీరి విడుదలకు ప్రయత్నించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని పాక్ జైళ్ల నుంచి వీరికి విముక్తి కల్పించారు. దీంతో ఇప్పుడు పాకిస్తాన్ జైళ్లలో ఒక్క ఆంధ్ర మత్స్యకారుడు కూడా లేకుండా చేశారు.

14 ఏళ్లకే జైలుకెళ్లా



ఇంట్లో పూట గడవక నాన్నతో చేపల వేటకి వీరావల్ వెళ్లా. అప్పుడు నాకు 14 ఏళ్లు. అక్కడకెళ్లిన నాలుగేళ్లకే (2018 నవంబర్‌లో) పాకిస్తాన్ వాళ్లు నాన్నని, నన్ను, మరికొంత మందిని జైల్లో పెట్టారు. 14 నెలలు జైల్లో ఉన్నాక మన సీఎం జగన్ సార్ విడిపించారు. మాకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. ఆ డబ్బుతో ఓ బోటు కొనుక్కున్నాం. కొంత డబ్బు అప్పుచేసి ఇల్లు కూడా కట్టుకున్నాం. అప్పటినుంచి గుజరాత్ వెళ్లకుండా ఇక్కడి నుంచే చేపల వేటకు వెళ్తున్నాం.

– నక్కా ధనరాజు, మత్స్యకారుడు, తిప్పలవలస

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు



ఎన్నో ఏళ్లుగా రాష్ట్రం నుంచి ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి గుజరాత్‌కు మత్స్యకారులు పెద్దఎత్తున వలస వెళ్తున్నారు. అక్కడ వారికిచ్చే జీతం తక్కువే అయినా స్థానికంగా ఉపాధి లేక వలస పోవాల్సిన పరిస్థితి. వీరి వలసలకు అడ్డుకట్ట వేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికక్కడ హార్బర్లు కడతానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం రూ.3,500 కోట్లతో 8 ఫిషింగ్ హార్బర్లు, 7 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టారు. పైగా పాక్ జైళ్లలో ఉన్న ఆంధ్ర మత్స్యకార్లు విడుదల చేయించారు. దీంతో ఈ ప్రాంతం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. సీఎంపై నమ్మకంతో అనేకమంది స్థానికంగా అందుబాటులో ఉన్న చోట నుంచి వేట సాగిస్తున్నారు. ఏపీ మత్స్యకారుల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వాసుపల్లి జానకిరామ్, అధ్యక్షుడు, మర పడవల సంఘం, విశాఖపట్నం

హార్బర్లొస్తే ఇక్కడి నుంచే వేటకు వెళ్తా



నేను 23 ఏళ్ల నుంచి పోరుబందరులో వేటకెళ్తాన్నా. ఐదేళ్ల కిందట నన్ను పాకిస్తాన్ జైల్లో పెట్టారు. ఆ జైల్లో నరకాన్ని చూపించారు. జబ్బొచ్చినా పట్టించుకోలేదు. సీఎం జగన్ సార్ మమ్మల్ని విడిపించి పుణ్యం కట్టుకున్నారు. ప్రస్తుతం మల్పీలోని హార్బర్‌కు వెళ్తున్నా. మా ప్రాంతంలో హార్బర్లు వచ్చే వరకు అక్కడికెళ్తాను. ఆ తర్వాత ఇక్కడి నుంచే వేటకెళ్తాను.

– మైలపల్లి భాస్కరరావు, కొయ్యాం, శ్రీకాకుళం జిల్లా

జగన్ సార్‌కి రుణపడి ఉంటాం



నాకు అక్క, చెల్లి ఉన్నారు. వారికి పెళ్లిళ్లు చేయడం నాన్న ఒక్కడి వల్లా కాదు. అందుకే ఏడో తరగతి చదువు మానేసి 14 ఏళ్లకే వీరావల్ హార్బర్‌కు వేటకి వెళ్లా. 5 నెలలకే పాకిస్తాన్ అధికారులకు చిక్కిపోడంతో జైల్లో పెట్టారు. రోజూ ఏడ్చేవాణ్ణి. 14 నెలల తర్వాత సీఎం జగన్ సార్ దయతో విడుదలయ్యాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలలో రూ.4 లక్షలు పెట్టి బోటు కొన్నాం. గుజరాత్‌కు వెళ్లకుండా మా ఊరి నుంచే వేటకెళ్తున్నాం. నెలకి రూ.25 వేల నుంచి రూ.30 వేల ఆదాయం వస్తోంది. అమ్మానాన్న దగ్గరే ఉంటున్నాం. మమ్మల్ని ఆదుకున్న సీఎం గారికి రుణపడి ఉంటాం.

– నక్కా నర్సింగ్, తిప్పలవలస, విజయనగరం జిల్లా

ప్రగతి పథంలో వాల్తేర్ డివిజన్

- గతేడాది కంటే 20.98 శాతం అధికంగా ఆదాయం
- వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ అత్యుత్తమ ఫలితాలతో దూసుకుపోతుంది. జూన్ నెలాఖరుతో ముగిసిన మొదటి త్రైమాసంలో డివిజన్ గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించి ప్రగతి పథంలో సాగిపోతున్నట్లు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. గురువారం దొండపర్తి డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గల ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మొత్తంగా ఈ జూన్ నెలాఖరుకు ముగిసిన మొదటి త్రైమాసంలో వాల్తేర్ డివిజన్ రూ.2,513.66 కోట్లు ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి రూ.2077.71 కోట్లు మాత్రమే ఉంది. ఈ సంవత్సరం దాదాపు 20.98 శాతం అధికంగా ఆదాయాన్ని డివిజన్ ఆర్జించింది.

ప్రయాణికుల రవాణా ద్వారా...

ఈ సంవత్సరం జూన్ నెలాఖరు వరకు 7.75 మిలియన్ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.192 కోట్లు వాల్తేర్ డివిజన్ ఆర్జించింది. ఇది గతేడాది కంటే 23.60 శాతం అధికం. ఇదే త్రైమాసికానికి 6.27 మిలియన్ ప్రయాణికుల రవాణా ద్వారా రూ.170.45 కోట్లు ఆదాయం సమకూరింది. ఇది గతేడాది కంటే 12.64 శాతం అధికం. ఇతర మార్గాల ద్వారా ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో రూ.18.10 కోట్లు ఆర్జించింది. గతేడాది ఇది 16.91గా ఉంది. మొత్తంగా 7.04 శాతం ఇతర ఆదాయాలను అధికంగా సాధించింది.

సరకు రవాణా ద్వారా..

వాల్తేర్ డివిజన్ గూడ్స్ రైళ్ల ద్వారా ఈ సంవత్సరం 18.13 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసింది. ఇది గతేడాది 16.28 మిలియన్ టన్నులు. గతేడాది కంటే 11.36 శాతం అధికంగా ఈ ఏడాది సరకు రవాణా చేసింది. ఈ సరుకు ద్వారా ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో రూ. 2,272.58 కోట్లు ఆదాయం సంపాదించింది. గతేడాది రూ.1,858.36 కోట్లు సంపాదించింది. గత క్వార్టర్ కంటే 22.29శాతం అధికంగా ఆదాయం డివిజన్‌కు సమకూర్చుకుంది.

పార్సిల్ రవాణా ద్వారా...

ఈ సంవత్సరం వివిధ పాసింజర్ రైళ్లలో 18.14 వేల టన్నుల పార్సిల్ రవాణా చేసింది. ఇది గతేడాది ఇది 11.39 వేల టన్నులుగా ఉంది. గతేడాది కంటే 80.86శాతం అధికంగా పార్సిల్ రవాణా చేసింది. ఈ సంవత్సరం దీని ద్వారా 6.94 కోట్లు ఆదాయం వచ్చింది. గతేడాది కేవలం రూ.3.61 కోట్లు మాత్రమే వచ్చింది. ఇది కూడా 92.58 శాతం అధికం.

భద్రతకు అధిక ప్రాధాన్యం

భద్రత విషయంలో వాల్తేర్ డివిజన్ మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని డీఆర్ఎం తెలిపారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ప్రతీ రోజు తనిఖీలు చేస్తున్నారని పేర్కొన్నారు. తరచుగా సిగ్నల్ అండ్ టెలికం సిబ్బందికి అవసరమైన శిక్షణ నిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం చివరికి భద్రతా విభాగంలో అదనంగా మరో 500 మంది సిబ్బంది వరకు నియమించుకునే అవకాశం ఉందన్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయని, తన హయాంలో విశాఖకు మరో రెండు ప్లాట్‌ఫాంలు ఏర్పాటయ్యేలా చూడడం సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రత్యేకమైన డివిజన్

వాల్తేర్ డివిజన్ ఇతర డివిజన్ల కంటే ప్రత్యేకమైనదని తెలిపారు. డివిజన్‌లో భౌగోళిక పరిస్థితులు భిన్నంగా ఉంటాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తుఫానులు, కొండచరియలు విరిగిపడడం వంటి వాటితో పాటు ఎక్కువగా టన్నెల్స్, మలుపులు, వంతెనలు, కటింగ్స్ ఉన్న డివిజన్ వాల్తేర్ డివిజన్ అని పేర్కొన్నారు. ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా వాల్తేర్ డివిజన్ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ దేశంలో గల టాప్-5 డివిజన్‌లలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



చీరలు పంపిణీ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి

దొండపర్తి: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మేయర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.ఎ.రెహ్మాన్, కార్పొరేషన్ చైర్మన్లు కోలా గురువులు, జాన్ వెస్లీ, సుజాత సత్యనారాయణ, సుజాత నూకరాజు, జోనల్ ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజబాబు, పీలా వెంకటలక్ష్మి, మారుతీ ప్రసాద్, బి.పద్మావతి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు కృపాజ్యోతి, బొండా ఉమామహేశ్వరరావు, అప్పన్న, వానపల్లి ఈశ్వరరావు, కె.వి.బాబా, మన్యాల శ్రీనివాస్, కోరాడ అప్పల నాయుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ ముఖ్య నాయకులు గొలగాని శ్రీనివాస్, వుడా రవి, సతీష్ వర్మ, పేర్ల విజయచంద్ర, నడింపల్లి కృష్ణంరాజు, పేడాడ రమణకుమారి, జగ్గుపల్లి అప్పలరాజు, ద్రోణంరాజు శ్రీ వత్సవ్, అంగా రామ్‌ప్రసాద్, పారిపల్లి రామారావు, జి.విక్టర్, జార్జ్ నాని, చొక్కర శేఖర్, నల్లా రవి, వెంకట్, మధు సంపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఈవోఐపై సాధ్యాసాధ్యాలు పరిశీలించండి

రాష్ట్ర పరిశ్రమల కమిషనర్ ఆదేశం




ఎంపీ ఎంవీవీకి లేఖ అందజేస్తున్న ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ముడి పదార్థాల సరఫరా, అడ్వాన్స్ పేమెంట్ ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)పై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని జిల్లా పరిశ్రమల అధికారిని రాష్ట్ర పరిశ్రమల కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన అధికారిక ఉత్తర్వులు పంపారు. ఈవోఐ ప్రకటన వెలువడిన తర్వాత ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఉక్కు కర్మాగారాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి, ఎంపీ ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో ఈ అంశంపై నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారికి లేఖ పంపింది. లేఖ ప్రతి అందుకున్న సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ గురువారం ఎంపీ ఎంవీవీని కలిశారు. జిల్లా పరిశ్రమల అధికారితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకునేలా సహకరించాలని కోరారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

- పుస్తకావిష్కరణ సభలో లక్ష్మీపార్వతి
- ఎన్టీఆర్‌ను చంపేసిన వారే నేడు పూలదండలు వేస్తున్నారని ఆవేదన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీపార్వతి

ఏయూక్యాంపస్: తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు నిలుస్తారని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో ఎన్టీఆర్ సింహగాయత్రం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందదర్భంగా పుస్తక రచయితలు డి.వి.ఎస్.శర్మ, చల్లా కృష్ణవీర్ అభిషేక్‌లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పదవికోసం తన ఆశయాలను ఎన్టీఆర్ ఎన్నడూ వదులుకోలేదన్నారు. ఆయన జీవిత చరిత్రను రెండు సంపుటాలుగా రచించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్టీఆర్‌ను చంపేసిన వారే నేడు దండలు వేస్తున్నారన్నారు. కాలం మంచి తీర్పు ఇచ్చిందన్నారు. వాస్తవాలను చెప్పడానికే తాను ఉన్నానన్నారు. తన రాజకీయ జీవితాన్ని సైతం తొక్కేశారని, తాను రచించిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాలు సైతం బయట అందుబాటులో లేకుండా చేశారన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ యువతకు గాంధీజీ ఆలోచనలు చేరువ చేసే విధంగా కృషిచేస్తున్నామన్నారు. పూర్వ సంచాలకులు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎన్టీఆర్ గాంధీజీ వేషాన్ని పోషించి అందరి మన్ననలు పొందిన సందర్భాన్ని వివరించారు. కార్యక్రమంలో చల్లా సుష్మిత, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ లిల్లి గ్రేస్,ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-4 అర్హుల జాబితా విడుదల

15న ధ్రువీకరణపత్రాల పరిశీలన

మహారాణిపేట: ఏపీపీఎస్సీ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి జిల్లాలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. 43 పోస్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో 84 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా https://visakhapatnam.ap.gov.inలో అందుబాటులో ఉందని, వీరంతా ఈ నెల 15న జెడ్పీ కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 23న కలెక్టర్ కార్యాలయంలో జరిగే కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థుల చిరునామాలకు వ్యక్తిగత మెమోలను రిజిస్టర్ పోస్టు, ఈమెయిల్ ద్వారా పంపించామని.. ఎవరికైనా మెమోలు అందకపోతే ఈ నెల 15న జెడ్పీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మృత్యు ఒడిలో మరో ఇద్దరు

- ఆరుకు చేరిన ఫార్మా ప్రమాద మృతుల సంఖ్య
- మంటలపాలైన వారంతా ప్రాణాలు కోల్పోయిన వైనం

రాంబిల్లి/మహారాణిపేట: అచ్యుతాపురం సాహితీ ఫార్మా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికులు గురువారం కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య ఆరుకు చేరింది. జూన్ 30న రియాక్టర్లు పేలి ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన రాంబిల్లి మండలానికి చెందిన ఎస్.నూకినాయుడు (48) కేజీహెచ్‌లో, నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాదిరెడ్డి రాజుబాబు (23) ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున ప్రకటించగా, ఫార్మా కంపెనీ యాజమాన్యం మరో 9 లక్షలు ఇవ్వనుంది. నూకినాయుడు కుటుంబసభ్యులకు రూ. లక్ష తక్షణ సాయంతోపాటు పరిహారానికి సంబంధించి రాతపూర్వక హామీ పత్రాన్ని సాహితీ ఫార్మా ప్రతినిధులు గురువారం అందజేశారు.

అందరికీ 100 రోజుల 'ఉపాధి'

సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం

మహారాణిపేట: జాబ్ కార్డులు ఉన్న అందరికీ 100 రోజుల ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్మిక సమీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జాతీయ రహదారుల భూసేకరణ, జగనన్నకు చెబుదాం తదితర అంశాల పురోగతిపై గురువారం సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఉపాధి కల్పించడంలో పేదలు, దివ్యాంగులపై మరింత దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నాడు-నేడు కింద జరుగుతున్న పనుల పురోగతి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాం కింద వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించి సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శునక షోయగం

బుజ్జిగా.. ముద్దులొలికేలా..



టీకాలు వేయించేందుకు కుక్కలను తీసుకొస్తున్న యజమానులు







కుక్కకు టీకా వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

దాబాగార్డెన్స్: జడ్జి కోర్టు సమీపంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో గురువారం పెంపుడు జంతువులు సందడి చేశాయి. ప్రపంచ జూనోసెస్ దినోత్సవం పురస్కరించుకుని యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను జీవీఎంసీ ఉచితంగా అందజేసే ఏర్పాట్లు చేసింది. దీంతో జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించేందుకు ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిని లాలిస్తూ.. బుజ్జగిస్తూ ఆస్పత్రి ఆవరణలో నిరీక్షించారు. ముఖ్యంగా అందమైన.. బుజ్జి బుజ్జి శునకాలు ముచ్చటగొల్పాయి. యజమానులపై ఎంతో ప్రేమ చూపుతూ, విధేయంగా మెలుగుతూ అలరించాయి. ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్



కుక్కకు సెలైన్ ఎక్కిస్తున్న పశు వైద్యులు

భద్రతకే అగ్ర స్థానం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్‌లో భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. గురువారం ఆయన సీనియర్ అధికారులతో కలిసి విశాఖ రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ (ఆర్‌ఆర్‌ఐ) కేబిన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. దీనికి సంబంధించిన సిగ్నల్ అండ్ టెలికం విభాగం పరిధిలోకి వచ్చే ప్యానల్ బోర్డ్స్, సర్క్యూటింగ్ ప్రాంతాలు, జంక్షన్ బాక్స్‌లు, గూమ్టిలు, ఎక్సల్ కౌంటర్ రూంలలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. రైల్వే ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమన్నారు. దీని ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలో శిక్షణలో ఉన్న లోకో పైలట్లు, సేఫ్టీ కౌన్సిలర్స్, వివిధ విభాగాలకు చెందిన సీనియర్ సూపర్‌వైజర్లతో మాట్లాడారు. రైళ్ల రాకపోకలు, నిర్వహణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డీఆర్‌ఎం వారికి సూచించారు.

పర్యావరణంపై ఎన్‌టీపీసీ నిబద్ధత



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ షరతులను పాటించడం లేదని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసిందని సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. పర్యావరణంపై ఎన్టీపీసీ నిబద్ధత కలిగి ఉందని కోర్టు నిర్ధారించినట్లు పేర్కొంది. ఎన్టీపీసీ సింహాద్రి పరిసరాల గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి అత్యాధునిక కాలుష్య నియంత్రణ సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తుందని తెలిపింది. ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేసి దిద్దుబాటు చర్యలు చేపడుతోందని వివరించింది. గాలి, భూగర్భ జలాలను 15 రోజులకొక పర్యాయం లేబొరేటరీల ద్వారా పరీక్షలు జరిపి వాటి నాణ్యత విషయంలో ఎటువంటి ప్రతికూలత లేదన్న విషయాన్ని కోర్టు నిర్ధారించిందని పేర్కొంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంస్థ సామాజిక అటవీశాఖ ద్వారా ఏటా 4 వేల చెట్లను నాటుతున్నట్టు సంస్థ తెలిపింది.

ఇన్‌స్టాలో యువతికి బెదిరింపులు

బాధితురాలికి ధైర్యం చెప్పిన దిశ పోలీసులు

పీఎంపాలెం: పీఎంపాలేనికి చెందిన ఓ యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ క్రమంలో తాను చెప్పినట్లు చేయకపోతే ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్ట్ చేస్తానని ఆ యువతిని బెదిరించాడు. తీవ్ర ఆందోళనకు గురైన ఆమె గురువారం దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు బాధిత యువతిని కలిసి ధైర్యం చెప్పారు. ఆ వ్యక్తి సోషల్ మీడియా ద్వారా యువతికి పంపిన సందేశాలు, ఫొటోలు సేకరించారు. అతను బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించి.. కేసు నమోదు చేశారు. త్వరితగతిన దర్యాప్తు చేసి అతన్ని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

కడలి అంచున మేఘాలు.. ఎగసిన కెరటాలు!





మేఘాలు కడలిని తాకడానికి తహతహలాడాయి. కెరటాలు మేఘాలను అందుకోవడానికి అన్నట్టు ఎగసి పడ్డాయి. అయితే వాటికి ఆ రెండూ సాధ్యం కాలేదు. ఎంతో హడావుడి చేసిన కరిమబ్బులు వర్షించకుండానే కనుమరుగయ్యాయి. కానీ కెరటాలు మాత్రం ఇంకా అలా ఎగసి పడుతూనే ఉన్నాయి. గురువారం సాయంత్రం విశాఖ సాగరతీరంలో ఈ సుందర దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.
- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

నేటి నుంచి వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలు

చంద్రంపాలెం హైస్కూల్‌లో ఏర్పాట్లు



ట్రోఫీని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, అతిథులు

మధురవాడ: జిల్లా స్థాయి మెన్ అండ్ వుమెన్ 10వ వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. చంద్రంపాలెం హైస్కూల్ ఆవరణలో మారుతీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు గురువారం పరిశీలించి.. ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ కార్యదర్శి, మారుతీ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు వంకాయల మారుతీప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 క్లబ్‌ల నుంచి 200 మంది వివిధ కేటగిరీలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారని చెప్పారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పిళ్లా సత్యనారాయణ, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఆర్‌వోసీ చైర్మన్ దండు నాగేశ్వరరావు, ఆర్‌వోసీ కార్యదర్శి కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

అల్లిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సిటు) ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన మున్సిపల్ ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసేలోగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఇంజినీరింగ్, నీటి సరఫరా, కార్మికులకు, స్కిల్డ్ సెమిస్కిల్డ్ జీతాలు, యూజీసీ కార్మికులకు హెల్త్ అలవెన్సులు మిగిలిన కేటగిరీలకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. కార్ డ్రైవర్లకు రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు మరోసారి సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.రాజు, నాయుడు పాల్గొన్నారు.

జర్మనీలో విద్యనభ్యసిస్తున్న భారతీయులు 34 వేలు

కొమ్మాది: జర్మనీలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతోందని ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేలా కుచ్లర్ అన్నారు. తాజా గణాంకాల ప్రకారం 34 వేల మంది భారతీయ విద్యార్థులు జర్మనీలోని వివిధ వర్సిటీల్లో పలు కోర్సులు అభ్యసిస్తున్నారని.. చైనా తర్వాత అత్యధిక సంఖ్యలో భారతీయ విద్యార్థులే ఉన్నారని వివరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంను గురువారం సందర్శించిన ఆమె ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. భారత్-జర్మనీ దేశాల మధ్య సుదీర్ఘ కాలం నుంచి బలమైన సంబంధాలు ఉన్నాయన్నారు. సాంకేతిక రంగంలో ద్వైపాక్షిక ఒప్పందాలు, పరస్పర సహకారం కొనసాగుతోందని వెల్లడించారు. జర్మనీ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు భారతీయ వర్సిటీలను సందర్శిస్తూ.. బోధన, పరిశోధనల్లో భాగస్వాములవుతున్నారని వివరించారు.

టీడీపీ నేత లాలం భాస్కరరావు మృతి

రాంబిల్లి : జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భర్త, మాజీ ఎంపీపీ టీడీపీ నేత లాలం భాస్కరరావు (65) గురువారం మృతి చెందారు. విశాఖ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించారు. భాస్కరరావు మృతదేహాన్ని స్వగ్రామం లాలంకోడూరుకు తరలించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబు), ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తరలి వచ్చి భాస్కరరావు మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆ అస్థి పంజరం.. ఇచ్ఛాపురం వాసిది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో దొరికిన అస్థి పంజరం కేసును స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఛేదించారు. ఆ అస్థి పంజరం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన కె.కోటేశ్వరరావుదిగా పోలీసులు గుర్తించారు. మేకల మేత కోసం వెళ్లి చెట్టు నుంచి కింద పడి అతను మృతి చెందినట్టు దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ నెల 1న టౌన్‌షిప్‌లో దొరికిన అస్థి పంజరం స్థానికంగా కలకలం రేకెత్తించింది. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు అతని వద్ద దొరికిన ఏటీఎం కార్డు, కత్తి, స్వాధీనం చేసుకున్న బైక్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పదేళ్ల కిందట భార్య, ఇద్దరు పిల్లలను వదిలి వచ్చేసిన కోటేశ్వరరావు దేశపాత్రునిపాలెంలో ఒంటరి మహిళతో ఉంటున్నాడు. నిత్యం గంజాయి సేవించి చిల్లర దొంగతనాలు చేయడం వృత్తిగా మార్చుకున్నాడు. ఇందులో భాగంగా మేకలను దొంగలించడం, వాటికి మేత తేవడం అతని ప్రవృత్తి. నెల రోజుల కిందట ఆ విధంగా టౌన్‌షిప్‌కు బైక్‌పై వచ్చిన కోటేశ్వరరావు కత్తితో కొన్ని కొమ్మలు కొట్టే క్రమంలో కింద జారిపడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకును కోటేశ్వరరావు బంధువులు గుర్తించడంతో కేసు చిక్కుముడి వీడింది. దొరికిన అస్థి పంజరంను పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నివేదిక ఆధారంగా దర్యాప్తు ముగియనుంది.